క్లుప్తంగా

ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయండి



జనగామ: ఆరోగ్యంగా ఉన్న యువతీ, యువకులు ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయాలని ఏఆర్ కానిస్టేబుల్ శాడ పోషయ్య పిలుపునిచ్చారు. బుధవారం ప్రభుత్వ జిల్లా జనరల్ ఆస్పత్రిలో పోషయ్య 36వ సారి రక్తదానం చేశారు. రక్తదానం చేసి మరొకరికి ప్రాణదానం చేయాలన్నారు.

'ఫాం హౌస్‌కు సీసీ రోడ్డు నిర్మాణంపై విచారణ చేపట్టాలి'

చిల్పూరు: గ్రామంలోని వార్డుల్లో సీసీ రోడ్లు లేక ఒకపక్క ప్రజలు ఇబ్బందులు పడుతుండగా సర్పంచ్ భర్త మనోజ్‌రెడ్డి తన ఫాంహౌస్ వరకు సీసీ రోడ్డు వేసుకుని నియోజకవర్గం నిధులను దుర్వినియోగం చేశాడని, దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి నిధులను రికవరీ చేయాలని గ్రామస్తులు బుధవారం డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని శ్రీపతిపల్లి సర్పంచ్ ప్రత్యూషారెడ్డి భర్త మనోజ్‌రెడ్డి ఫాంహౌస్ వరకు వేసిన సీసీ రోడ్డు వద్ద నిరసన తెలిపారు. ఉడుత వేణు, పాలబోయిన నరేష్, జోగులు, పాషా, బర్మ పోశయ్య, పల్లపు నగేష్, సురేష్ పాల్గొన్నారు.

నియామకం



వెంకటేశ్వర్లు

పాలకుర్తి టౌన్: గౌడజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర పొలిట్ బ్యూరో ప్రధాన కార్యదర్శిగా పాలకుర్తికి చెందిన మూల వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో జరిగిన పోరాట సమితి సమావేశంలో వెంకటేశ్వర్లును నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు యెలికట్టె విజయ్‌కుమార్ ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తన శ్రమను గుర్తించి మరిన్ని బాధ్యతలు అప్పగించిన విజయ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బియ్యం అందజేత

జఫర్‌గఢ్: జఫర్‌గఢ్ గ్రామానికి చెందిన నీలం ఎల్లయ్య, దేవరాయి ఉప్పలయ్య ఇటీవల మృతి చెందారు. కాగా, విషయం తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా నాయకుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్నెబోయిన భిక్షపతి ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు 50 కిలోల చొప్పున బియ్యం బుధవారం అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కుక్కల ఎల్లయ్య, పార్టీ నాయకులు ఉల్లి శివరాజు, తాటికాయల రాజేందర్, మేర్గు ఎల్లగౌడ్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి బాసట

దేవరుప్పుల: ఐదేళ్ల కిందట ఉపాధి హామీ పనులు చేసిన ఓ ఉపాధి కూలీ అనారోగ్యంతో మృతి చెందగా సదరు కూలీ వేతనాలు ఇప్పించడంలో అధికారుల వైఫల్యం పొందగా ఆ బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు బాసటగా నిలిచి రూ.10 వేల పెండింగ్ వేతనాల చెక్కును బుధవారం పోస్టాఫీసులో ఇప్పించారు. మండలంలోని ధర్మాపురానికి చెందిన పిట్టల అంజయ్య 2019లో అనారోగ్యంతో మృతి చెందగా ఆయన చేసిన ఉపాధి కూలీ వేతనం నిలిచిపోయింది. ఈ విషయమై మృతుడి భార్య అంజమ్మ కార్యాలయాల చుట్టు తిరిగిన లాభం లేకుండా పోయింది. ఈ విషయం తెలిసిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పెండింగ్‌లో ఉన్న బిల్లు చెక్కును ఎస్‌పీఎం రవి చేతుల మీదుగా ఇప్పించడంతో బాధితురాలు కృతజ్ఞతలు తెలిపింది.

చేయూత

స్టేషన్‌ఘన్‌పూర్: ఛాగల్లు గ్రామానికి చెందిన స్వాగత్‌యూత్ సభ్యుడు మహంకాళి హరి ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబానికి స్వాగత్‌యూత్ అసోసియేషన్ వారు తమవంతుగా అండగా నిలబడి చేయూతను అందించారు. ఈ మేరకు బాధిత కుటుంబానికి యూత్ ఆధ్వర్యంలో రూ.48,750 సాయం అందజేశారు. ముందుగా యూత్ బాధ్యులు హరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రగాఢ సంతాపం తెలిపారు.

మద్యం పట్టివేత



రఘునాథపల్లి: ఖిలాషాపూర్, కుర్చపల్లిలో అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు నిర్వహించగా అక్రమ మద్యం పట్టుబడింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. మండలంలోని ఖిలాషాపూర్‌లో సక్కుబాయి, చెవ్వ అంజయ్య, కుర్చపల్లిలో పేరబోయిన కొమురయ్యలు బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో బుధవారం వారి గృహాల్లో తనిఖీలు చేపట్టారు. అక్రమంగా నిల్వ చేసిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని తగు చర్యల నిమిత్తం రఘు నాథపల్లి పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. తనిఖీలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూధన్, సీఐ పి రమేష్, సిబ్బంది ఉన్నారు.

పంచాయతీ పాలకవర్గానికి సత్కారం



రఘునాథపల్లి: సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానించిన గ్రామస్తులు



దేవరుప్పుల: కడవెండిలో..



దేవరుప్పుల: సింగరాజుపల్లిలో..



జఫర్‌గఢ్: ఉప్పుగల్లులో..



లింగాలఘణపురంలో..



బచ్చన్నపేట: వీఎస్ఆర్‌నగర్‌లో వార్డు సభ్యులను సన్మానిస్తున్న సర్పంచ్ స్వామి

దేవరుప్పుల: ఐదేళ్ల పాటు గ్రామ సమగ్రాభివృద్ధికి పాటుపడిన పంచాయతీ పాలకవర్గానికి పలు గ్రామాల్లో వీడ్కోలు సన్మానం చేశారు. మండలంలోని కడవెండి, సింగరాజుపల్లి గ్రామ పంచాయతీల్లో గ్రామ కార్యదర్శులు మధుకర్, సంపత్ ఆధ్వర్యంలో సర్పంచ్, వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు పోతరెడ్డి బెల్లీనాలీ నారెడ్డి, గోపాలుదాసు మల్లేష్, ఉపసర్పంచ్‌లు నగేష్, బుచ్చిరెడ్డి, జీపీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకన్నగౌడ్, కారోబార్ సోమరాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రఘునాథపల్లి: మండలంలోని మండలగూడెం గ్రామ పంచాయతీ పాలకవర్గం ఐదేళ్ల పాటు గ్రామానికి అందజేసిన సేవల నేపథ్యంలో బుధవారం గ్రామస్తులు పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ ఉత్తెపు ఉమారాణిసత్యనారాయణ, ఉప సర్పంచ్ పుప్పాల వేణుకుమార్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో వారు మాట్లాడుతూ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల సేవలు ఆదర్శనీయమన్నారు. ఐదేళ్ల పదవీ కాలంలో గ్రామాభివృద్ధితో పాటు, వీధిలైట్లు, పారిశుద్ధ్య నివారణ, సీసీ రోడ్లు, తాగు నీటి సమస్య తీర్చడంలో విశేష సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, వార్డు సభ్యులు డ్యాగల రమ్య, అనిల్, మల్లమ్మ, నరేందర్, యాదలక్ష్మి, వేణు, వనజ, కోఆప్షన్ సభ్యులు గాదె ప్రకాష్, తోట మల్లయ్య, గాదె సరిత, వివోఏలు సరిత, ఉపేందర్ గ్రామ పెద్దలు సుదర్శనం, వెంకటాద్రి, సిద్దేశ్వర్, వెంకటేశ్వర్లు, కుమార్, రాజశేఖర్, ఉపేందర్, మోహన్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: గ్రామస్తుల సహకారంతోనే గ్రామాలను అభివృద్ధి చేసుకున్నామని పలు గ్రామాల సర్పంచ్‌లు అన్నారు. మండలంలోని వంగ సుదర్శన్‌రెడ్డినగర్, నారాయణపురం, గోపాల్‌నగర్, బచ్చన్నపేట గ్రామాల సర్పంచ్‌లు ఆయా వార్డు సభ్యులను పలువురు అధికారులను శాలువాలతో సన్మానించారు. అలాగే పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. సర్పంచ్‌లు కోనేటి స్వామి, పర్వతం మధుప్రసాద్, మాసపేట రవీందర్‌రెడ్డి, వడ్లెపల్లి మల్లారెడ్డి, ఉప సర్పంచ్‌లు చవాన్ నరేష్, వద్ది ఎల్లయ్య, కొండ హరికృష్ణ, పంచాయితీ కార్యదర్శులు రుబీనా సుల్తానా, దేవీ ప్రసాద్, అనిల్‌రాజ్, మోకు కవిత, వార్డు సభ్యులు, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: గ్రామాల అభివృద్ధికి పంచాయతీ పాలకవర్గం సేవలు అభినందనీయమని ఎంపీపీ రడపాక సుదర్శన్, జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు పేర్కొన్నారు. మండలంలోని ఉప్పుగల్లు, తమ్మడపల్లి (ఐ) గ్రామాలలో గ్రామ పంచాయతీ పాలకవర్గం పదవీ కాలం ముగియనుండడంతో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు గాదెపాక సువర్ణ అయోధ్య, గాదెపాక అనిత సుధాకర్‌బాబుతో పాటు వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బందిని శాలువలు, మెమొంటోలు, పూలదండలతో సత్కరించారు. ఎంపీడీఓ శ్రీధర్ స్వామి, వైస్ ఎంపీపీ కొదారి కనకయ్యతో పాటు వివిధ శాఖల అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లింగాలఘణపురం: గ్రామ సర్పంచ్‌గా ఐదేళ్ల పదవీ కాలం పూర్తి చేయడంలో గ్రామాభివృద్ధికి గ్రామ ప్రజలు అందించిన సహకారం అభినందనీయమని సర్పంచ్ విజయ్‌మనోహర్ అన్నారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ పాలక వర్గానికి పదవీ విరమణ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భిక్షపతి, ఎంపీఓ మల్లికార్జున్, పంచాయితీ కార్యదర్శి ప్రవీణ్, ఉపసర్పంచ్ కవిత, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పరిపాలనకు సిద్ధంకండి



దేవరుప్పుల: పంచాయతీ ప్రజాప్రతినిధుల పదవీ కాలం ముగిసినందున ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక పరిపాలన కొనసాగేందుకు పంచాయతీ కార్యదర్శులు సంసిద్ధం కావాలని ఎంపీడీఓ వడ్డెపల్లి ఉమామహేశ్వర్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామ పంచాయతీ సంబంధించి అన్ని రికార్డులు, డిజిటల్ కీలు ఎక్కడ ఉన్నా కార్యదర్శులు తమ ఆధీనంలోకి తీసుకోవాలని, ప్రత్యేక అధికారుల కేటాయింపు జరుగగానే సమన్వయంతో బాధ్యాతయుతంగా విధులు నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉండాలని పునరుద్ఘాటించారు. సమీక్షలో ఎంపీఓ టి సురేష్‌కుమార్, ఇజిఎస్ ఎపిఓ కమ్మగాని శ్రీనివాస్, ఈసీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

పాలకుర్తి: ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎంపీపీ నాగిరెడ్డి, సర్పంచ్ వీరమనేని యాకాంతారావు అన్నారు. బుధవారం వారు ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో పని చేస్తున్న వైద్య సిబ్బంది సకాలంలో హాజరై రోగులకు సేవలు అందించాలని చెప్పారు.

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



బాలరాజు యాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

బచ్చన్నపేట: రాబోవు పార్లమెంట్ ఎన్నికలను సమర్థవంతగా ఎదుర్కోవడానికి కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ డాక్టర్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ అన్నారు. బుధవారం కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న అనంతరం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు వడ్లెపల్లి ఉపేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 17 స్థానాలను గెలిపించుకొని కాంగ్రెస్ నాయకులకు గుణపాఠం చెప్పాలని అన్నారు. ఈ సందర్భంగా బాలరాజు యాదవ్‌ను శాలువాలతో సన్మానించారు. మండల కోఆప్షన్ సభ్యుడు షబ్బీర్, సర్పంచ్ గిద్దెల రమేష్, నాయకులు జిల్లా సందీప్, బనుక శివరాజ్‌యాదవ్, జంగిడి సిద్దులు, జావీద్, పడిగల కర్ణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ కమిటీల ఎన్నిక



దండెం ప్రకాశం

తరిగొప్పుల: సోలిపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల కోఆర్డీనేటర్ వగలబోయిన యాదగిరి ఆధ్వర్యంలో బుధవారం గ్రామ కమిటీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా దండెం ప్రకాశం, ఉపాధ్యక్షుడిగా చెవిటి రాజు, కోశాధికారిగా పాండ్యాల బుచ్చయ్య, కార్యదర్శిగా నారోజు సతీష్‌చారి, కార్యవర్గ సభ్యులుగా నందరబోయిన పోషయ్య, నందనబోయిన ఐలయ్య, పాండ్యాల నర్సింహులు, బాలరాజు, దండెం రాజు, మెరుగు కనకయ్య, వంగ రాజు, సోషల్ మీడియా కన్వీనర్‌గా బండి కైలాసం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గాదెపాక శ్రీనివాస్, అంక సత్తయ్య, దండెం అబ్రహం, ఇస్సాకు, కనకయ్య, బాలనర్సు, నర్సింహులు పాల్గొన్నారు.

సూర్యబండ గ్రామంలో..



నర్మెట: కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలకేంద్రం, సూర్యబండ గ్రామంలో మండల కోఆర్డీనేటర్ గంగం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం గ్రామ ,యూత్, మహిళా కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా ప్రజ్ఞాపురం శ్రీధర్, భూక్య శంకర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా పల్లె ప్రభుదాస్, భూక్య రమేష్, మహిళా అధ్యక్షురాలుగా పులి రేణుక, భూక్య సరిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

జీపీ భవనాలు ప్రారంభం



జఫర్‌గఢ్: జీపీ భవనం ప్రారంభంలో ప్రజాప్రతినిధులు



పాలకుర్తి: గుడికుంట్లతండాలో.. ఎంపీపీ, సర్పంచ్

జఫర్‌గఢ్: మండలంలోని హిమ్మత్‌నగర్, తిమ్మాపూర్ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ఎంపీపీ సుదర్శన్, జెడ్పీటీసీ సభ్యురాలు బేబి శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ కర్ణాకర్‌రావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభలకు సర్పంచ్‌లు తాటికాయల అశోక్, పొన్నాల జ్యోతి నాగరాజు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా వారు మాట్లాడుడూ గత ప్రభుత్వ హయంలో గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ భవనాలతో పాటు పల్లె ప్రకృతి వనాలు, శ్మశానవాటికలు, డంపింగ్‌యార్డులు, సీసీ రోడ్లు, క్రీడాప్రాంగణాలు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ పాలకవర్గం పదవీ కాలం ముగియడంతో ఘనంగా సన్మానించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుజ్జరి రాజు, ఎంపీటీసీ సభ్యురాలు యారనీలమ్మ సోమిరెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు..

మండలంలోని తిమ్మాపూర్‌లో జిల్లా పరిషత్ ద్వారా మంజూరైన నిధులు రూ.3లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, ఎంపీపీ రడపాక సుదర్శన్, సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా బేబి మాట్లాడారు. సర్పంచ్ పొన్నాల జ్యోతి నాగరాజు, ఎంపీటీసీ సభ్యురాలు యార నీలమ్మ సోమిరెడ్డి, మార్కెట్ మాజీ డైరక్టర్ రాజ్‌కుమార్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఎర్ర నరేష్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుడికుంట్లతండాలో...

పాలకుర్తి: మండలంలోని గుడికుంట్ల తండాలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, సర్పంచ్ బానోత్ క్రాంతి యాకూబ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సందర్భంగా పాలకుర్తి మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వీరమనేని యాకాంతరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాటూరి యాకాంతరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కార్యదర్శి గిరగాని కుమారస్వామి, ఉప సర్పంచ్ మూర్తి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గొల్లకురుమలకు అండగా సీపీఐ పోరాటం



గొర్రెల కంచెను పరిశీలిస్తున్న సుగుణమ్మ

తరిగొప్పుల: ధరణి పోర్టల్‌లోని లొసగులను ఉపయోగించుకొని నర్సాపూర్ గ్రామానికి చెందిన గొల్లకురుమలకు చెందిన భూమిని అబ్దుల్‌నాగారం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అక్రమంగా పట్టా పొందారని గొల్లకురుమలకు న్యాయం జరిగేంత వరకు సీపీఐ తరపున పోరాటం చేస్తామని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు పాతూరి సుగుణమ్మ అన్నారు. బుధవారం పార్టీ మండల కార్యదర్శి గుంటి కుమారస్వామితో కలిసి గొర్రెల కంచెను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సుగుణమ్మ మాట్లాడుతూ అబ్దుల్‌నాగారం శివారులో సర్వేనంబర్ 135లో గ్రామానికి చెందిన కాత సాయిలు, కాత చంద్రయ్య, కాత బాలయ్య, కాత బొందయ్యలకు చెందిన 8 ఎకరాల విస్తీర్ణం భూమిని 1992 నర్సాపూర్ గ్రామానికి చెందిన గొల్లకురుములు జీవాల మేత కోసం కొనుగోలు చేశారని తెలిపారు. కాగా ఈ భూమిని కాత బాలయ్య, చంద్రయ్య, బొందయ్య, సాయిలు వారసులు కాత వెంకటేష్, నర్సింహారావు, వెంకటయ్య, భాస్కర్, పవణ్‌కల్యాణ, యాదగిరి సాదాబైనామలో అక్రమంగా పట్టా చేసుకోవడం జరిగిందన్నారు. దీంతో గొల్లకురుమల జీవనోపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సంబంధిత జిల్లా అధికారులు తగు చర్యలు తీసుకొని గొల్లకురుమలకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సంబంధిత వ్యక్తులకు భూమి హక్కులు రద్దు చేసి గొల్లకురుమలకు ఆ భూమిని చెందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి తీసుకువచ్చే భూమాతా పార్టల్ ద్వారా గొల్లకురుమలకు న్యాయం చేయాలని కోరారు. చిక్కొండ పోషయ్య, శెట్టి కొమురయ్య, ఎనుగుల బక్కయ్య, పెద్ది ఉప్పలయ్య, గుంటి పోషయ్య, ఎనుగులు వెంకటయ్య, గుంటి జంపయ్య, కిష్టయ్య, రాజయ్య పాల్గొన్నారు.

భవిష్యత్‌లోనూ ఇదే జోరు కొనసాగించాలి



మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

కొడకండ్ల: గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేసిన తరహాలోనే రాబోయే పార్లమెంట్, ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల్లోను కొనసాగించాలని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అధ్యక్షతన గ్రామాల వారిగా పార్టీ శ్రేణులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడారు. టీపీసీసీ మాజీ సభ్యుడు నిరంజన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, మండల ఇన్‌చార్జ్ ప్రసాద్‌రెడ్డి, మండల కోఆప్షన్‌సభ్యుడు నసీరుద్దీన్, మోహన్, రవీందర్ పాల్గొన్నారు. కాగా, పార్టీ కార్యాలయంలో నిర్వహించిన గద్దర్ వర్ధంతిలో ఝాన్సీరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు.

పెండింగ్ బిల్లులు ఇవ్వాలని పాడి రైతుల నిరసన



వడ్లకొండలో నిరసన తెలుపుతున్న పాడిరైతులు

బచ్చన్నపేట/జనగామ రూరల్/జఫర్‌గఢ్/చిల్పూరు/స్టేషన్‌ఘన్‌పూర్: జిల్లాలోని పలుగ్రామాల్లో విజయడెయిరీకి పాలుపోసే రైతులు తమకు రావాల్సిన రెండు నెలల పెండింగ్ బిల్లులు ఇవ్వాలని పాలసేకరణ సెంటర్ల వద్ద బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సొసైటీ అధ్యక్షులు మాట్లాడుతూ విజయ డెయిరీకి పాలుపోసి రెండు నెలలు కావస్తున్నా పాడి రైతులకు బిల్లులు చెల్లించడం లేదన్నారు. ప్రతీ 15 రోజులకోసారి చెల్లించాల్సిన పాల బిల్లులు 45 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు చెల్లించలేదని తెలిపారు. దీంతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమాల్లో సొసైటీ అధ్యక్షులు, పాడి రైతులు పాల్గొన్నారు.

దైవభక్తిని పెంపొందించుకోవాలి



బచ్చన్నపేట: ఇళ్లలో ప్రతి ఒక్కరూ పూజలు చేస్తూ దైవభక్తిని పెంపొందించుకోవాలని గజ్వేల్ మర్రికూక్ ఆశ్రమ పీఠాధిపతి వీరధర్మాజీ అన్నారు. బుధవారం మండలంలోని కేసిరెడ్డిపల్లిలో అయోధ్య నుంచి తెచ్చిన శ్రీరాముని పాదుకలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పాండురంగ ఆశ్రమ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు

దేవరుప్పుల: వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో అర్హులైన పట్టభద్రులకు ఓటు హక్కు కల్పించేందుకు మండల కార్యాలయంలో తహసీల్దార్ హుస్సేన్ ప్రత్యేక హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను సకాలంలో కార్యాలయంలో చేర్పడమేగాక గెజిటెడ్ సంతకం సౌలభ్యం లేని వారికి ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలను తీసుకవస్తే సత్వరమే ఆమోదింపజేసే ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని నమిలిగొండ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు జింక భిక్షపతి భార్య జింక సరోజన అనారోగ్యంతో మృతిచెందింది. కాగా, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య బుధవారం గ్రామానికి చేరుకొని వేర్వేరుగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. సర్పంచ్ ఉప్పలస్వామి, ఎంపీటీసీ రజాక్‌యాదవ్, ఉపసర్పంచ్ రాంచంద్రు, నాయకులు గణేష్, ప్రభాకర్ ఉన్నారు.

కూలీలతో ముచ్చటించిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన పర్యటనలో భాగంగా బుధవారం మండలంలోని నమిలిగొండ గ్రామానికి వెళ్లి వస్తుండగా గ్రామంలో బీటీ రోడ్డు పక్కన కాల్వ వద్ద ఉపాధి హామీ కూలీలు పనిచేస్తుండగా గమనించి అక్కడ కారు ఆపి వారితో కాసేపు ముచ్చటించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ కూలీలను అడిగి తెలుసుకున్నారు.

ఖిలాషాపూర్‌లో..

రఘునాథపల్లి: మాతృమూర్తిని కోల్పోయిన మండలంలోని ఖిలాషాపూర్ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు అల్లిబిల్లి నర్సయ్యను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరామర్శించారు. నర్సయ్య తల్లి వెంకటమ్మ (71) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే బుధవారం నర్సయ్య నివాసానికి చేరుకొని అతని తల్లి వెంకటమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తా..

చిల్పూరు: గ్రామ క్రీడాకారులకు తనవంతు సహాయ సహకారాలను అందిస్తూ ప్రోత్సహిస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని పల్లగుట్ట గ్రామంలో ఇటీవల నలుగురు అనారోగ్యంతో మృతి చెందగా, మరో ఇద్దరు అనారోగ్యంతో బాధ పడుతున్నారు. కాగా, ఆయా కుటుంబాలను చిల్పూరు ఆలయ శాశ్వత అభివృద్ధి దాత పొట్లపల్లి శ్రీధర్‌రావుతో కలిసి ఎమ్మెల్యే పరామర్శించారు. ముందుగా శ్రీధర్‌రావు నివాస గృహంలో యంగ్‌స్టార్ మారేపల్లిగూడెం క్రికెట్ టీం సభ్యులు ఎమ్మెల్యే కడియంను మర్యాదపూర్వకంగా కలిసి ఈనెల 4వ తేదీన నిర్వహించే క్రికెట్ పోటీల ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానించారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

కొడకండ్ల: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలను ఆదర్శంగా నిలుపాలని ఎస్ఓ పేరం శారద కోరారు. బుధవారం మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వేల్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

లింగాలఘణపురం: మండలంలోని ఏనెబావిలో పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి రూ.25వేల విరాళం అందించారు. బుధవారం జెడ్పీటీసీ వంశీధర్‌రెడ్డిని ఉపసర్పంచ్ పుట్ట సిద్దులు ఆధ్వర్యంలో కలిసి గుడి నిర్మాణానికి సహాయం అందించాలని కోరగా స్పందించారు. మహేందర్, పరమేశ్, కనకయ్య ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

జాతర విజయవంతానికి కృషి

చిల్పూరు: తెలంగాణలో మినీ మేడారంగా పేరున్న లింగంపల్లి సమ్మక్క–సారలమ్మ జాతర విజయవంతానికి రాజకీయాలకు అతీతంగా కలిసి కట్టుగా కృషి చేద్దామని ప్రజాప్రతినిధులు అన్నారు. మండలంలోని లింగంపల్లి జాతర ప్రాంగణంలో బుధవారం గ్రామ కులసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు, దాతల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి వైస్ చైర్మన్, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగంపల్లి జాతర దేవాదాయ శాఖలో ఉన్నందున చైర్మన్ మినహాయించి ఉత్సవ కమిటీని అందరి ఏకాభిప్రాయంతో వైస్ చైర్మన్‌గా రావుల పల్లి వెంకటేశ్వర్లు, కార్యదర్శి తేజావత్ వినోద్, కోశాధికారి గుంటిపల్లి వాజిపేయ్‌ని ఏకాభిప్రాయంతో ఎనుకున్నట్లు తెలిపారు. సమావేశంలో సర్పంచ్ ఏదునూరి రవీందర్, ఎంపీటీసీ కంకటి రవి, ఉప సర్పంచ్ కంకటి రాజన్న, కండ్లకోలు బాలరాజు, గంగుల సంపత్‌రెడ్డి, కర్ణాకర్, రచ్చ రవీందర్,కె. శ్రీనివాస్, అపరాదపు రాజు ఉన్నారు.

దేవాదుల కాల్వ పునరుద్ధరణ పనులు ప్రారంభం

జఫర్‌గఢ్: మండలంలోని తీగారం గ్రామం మీదుగా వెళ్లే దేవాదుల కాల్వ పునరుద్ధరణ పనులు ప్రారంభించినట్లు సర్పంచ్ గోనె జైపాల్‌రెడ్డి తెలిపారు. దేవాదులకు సంబంధించిన కాల్వ పూడికతీత పనులు చేపట్టాలని తీగారం, తానేదార్‌పల్లి, విశ్వనాథపురం గ్రామాలకు చెందిన రైతులు ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, దీనికి ఎమ్మెల్యే స్పందించి కాల్వల పూడికతీత పనులు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారని తెలిపారు. కాగా, సంబంధిత అధికారులు పొక్లెయిన్ యంత్రాలతో పూడికతీత పనులు చేపట్టడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఎల్మకంటి స్వామి, సముద్రాల కుమారస్వామి, కలకోట యాదగిరి, మహిపాల్, జ్యోతిబాబు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

దేవరుప్పుల: మండలంలోని కడవెండికి చెందిన ఓ యువతి అదృశ్యమైన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై కొంగరి శ్రవణ్‌కుమార్ తెలిపారు. వివరాలు.. మండలంలోని కడవెండికి చెందిన మహమ్మద్ ఆసియా (21) హైదరాబాద్‌లోని గురుకుల హాస్టల్‌లో డీగ్రీ విద్యనభ్యసిస్తోంది. గత నెల 29వ తేదీన ఇంట్లో నుంచి కళాశాల హాస్టల్‌కు వెళ్లేటప్పుడు చదువుకునే పుస్తకాలు మర్చిపోయిందని, వాటిని తల్లీ సాఫియా తెల్లారి ఇచ్చేందుకు హాస్టల్‌కు వెళ్లగా కనిపించలేదు. గత రెండు రోజులుగా యువతి ఆచూకి కోసం గాలించినా లాభం కాకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

జనగామ–సూర్యాపేట రహదారి మున్‌పహాడ్ వద్ద జరిగిన ఓ రోడ్డు ప్రమాదం విషయమై బుధవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై కొంగరి శ్రవణ్‌కుమార్ తెలిపారు. గత నెల 15వ తేదీన సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని నాంచారీ సోమయ్య చికెన్ తీసుకోవడానికి రోడ్డు దాటుతుండగా సూర్యాపేట వైపు నుంచి దేవరుప్పులకు వస్తున్న కన్న అఖిల్ మోటారు సైకిల్‌పై వచ్చి ఢీకొట్టాడు. ఈ సంఘటనతో సోమయ్యకు తీవ్రగాయాలవడంతో వైద్య చికిత్స కోసం ఆస్పత్రిలో చేర్చారు. బాధితుడి కుటుంబ సభ్యుడు నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కాపర్‌వైర్ల చోరీ

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని రాఘవాపూర్‌లో వ్యవసాయ బావుల మోటార్లకు విద్యుత్‌సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి కాపర్‌వైర్లు దొంగిలించిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. రాఘవాపూర్‌లో సదుగుల యాదగిరి, పవన్, గోపాల్‌రెడ్డి, శ్రీశైలం తదితర 20 మంది రైతులకు చెందిన వ్యవసాయ బావుల మోటార్లకు విద్యుత్ సరఫరా చేసే రెండు ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి ధ్వంసం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులో ఉన్న కాపర్ వైర్, ఆయిల్‌ను చోరీ చేశారు. ప్రస్తుతం రైతులు నార్లు పోసుకుని ఉన్నారని, ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేయడంతో తమకు నీరు అందడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇలాంటి ఘటనలు గతంలో కూడా జరిగాయని, సంబంధిత అధికారులు, పోలీసులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.